క్లుప్తంగా

విద్యుత్ లైన్ తరలింపు పనులు ప్రారంభం



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామంలో ఇళ్లపై నుంచి ఉన్న 11కేవీ లైన్‌ని తొలగించి మరోచోట ఏర్పాటు చేసే పనులను విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. గ్రామంలోని కొత్తగూడెం ప్రాంతంలో రోడ్డు పక్కనే గల నివాస గృహాలపై నుంచి విద్యుత్ లైన్ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంలో రాష్ట్రకార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామికి లైన్ వల్ల ఎదుర్కొంటున్న బాధలను వివరించారు. దీంతో విద్యుత్‌లైన్ విషయంలో చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కాగాలైన్ తరలింపు కోసం విద్యుత్ నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నస్పూర్: పట్టణ పరిధిలోని షిర్కే కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం వికాస తరంగిణి నస్పూర్ శాఖ, లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు గర్భకోశ, రొమ్ము క్యాన్సర్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో తరంగిణి జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కో ఆర్డినేటర్ వనజ, డాక్టర్ అభిషేక్, ట్రస్ట్ మెంబర్ లయన్ సుగుణాకర్ రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్లు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


'గడప గడపకూ బీజేపీ'



పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం బీజేపీ నాయకులు గడపగడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. నాయకులు గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని బొందపెట్టి, రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల ఎన్నికల్లో బీజేపీ ప్రతినిధులను గెలిపించి సత్తా చాటుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ చెన్నూర్ మండల ఎన్నికల ఇన్‌చార్జి రత్న లక్ష్మీనారాయణరెడ్డి, ఎన్నికల ప్రచారి బత్తుల సమ్మన్న, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సభ్యులు దుర్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం విఫలం'



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు సాంబారి వెంకటస్వామి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన పిమ్మట సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ఏఐటీయూసీ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు కార్మికుల్లో వస్తున్న అసంతృప్తిని గమనించి ఓడిన సంఘాల మాదిరిగా వినతిపత్రాలు ఇస్తున్నారన్నారు. మెడికల్ బోర్డులో మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ జాబ్ ఇప్పించలేకపోవటం సిగ్గుచేటన్నారు. లాభాల వాటా యాజమాన్యం నేటికీ ప్రకటించలేదని, అయినా గుర్తింపు సంఘం నోరుమెదపటం లేదన్నారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీలు సరిగ్గా పనిచేయకపోవటం వల్లే గని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు అల్లి రాజేందర్, శ్రీనివాస్, తిరుపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో, రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. పలు కాలనీల్లో నెలల తరబడి డ్రెయినేజీ నీరు ఇళ్ల ముందు పారుతుండడంతో, డ్రెయినేజీ నీటిని దారిమళ్లించేందుకు మ్యాన్‌హోల్‌ను తెరిచి, మురుగు నీటిని తిరిగి డ్రెయినేజీలోకి పంపిస్తున్నారు. కానీ రాత్రి సమయాల్లో రోడ్లపై వెళ్లే వాహనదారులకు మ్యాన్‌హోల్ తెరిచి ఉంచడం గమనించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

108కు నీడ కరువు



తాండూర్: ప్రజలను ఆపద సమయంలో ఆదుకునే 108వాహనానికి నీడ కరువైంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వాహనం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఓ మూలకు ఉంటోంది. అధికారులు స్పందించి 108వాహనంలోని మందులు చెడిపోకుండా ఉండేలా, వాహనానికి నీడ కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



చెన్నూర్ బట్టిగూడెం కాలనీ పక్కనే మురికినీటి గుంతలో మొలచిన పిచ్చి మొక్కలు

- చెన్నూర్ పట్టణంలో మురికి గుంతలు.. పిచ్చి మొక్కలు..
- స్వైర విహారం చేస్తున్న దోమలు
- విష జ్వరాలతో ఇద్దరు మృతి..
- పట్టించుకోని అధికారులు

చెన్నూర్: మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేసింది. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో దోమలు విపరీతంగా పెరిగి జనాలు జ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలోని బట్టిగూడెం, జోగిని కాలనీల్లో వారం వ్యవధిలోనే విష జ్వరాలు ప్రబలి ఇద్దరు మహిళలు మృతి చెందారు. పారిశుధ్య లోపంతో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ పదేపదే హెచ్చరిస్తున్నా స్థానిక అధికారులు పెడచెవిన పెడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది.

పేరుకుపోతున్న చెత్త...

మున్సిపాలిటీలో చెత్త సేకరించే వాహనాలు లేక కాలనీల్లో ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉంటున్నాయి. చెత్త వాహనాలు సరిపడా లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది చెత్త కుప్పలను తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు చెత్తకుప్పలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని కాలనీ ప్రజలు అంటున్నారు. కాలనీల సమీపంలో గల ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరడంతో పాటు చెత్త కుప్పలతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు తీవ్రతరం కావడంతో ప్రజలు విష జ్వరాల భారిన పడుతున్నారు.

గతేడాది...

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో గతేడాది ప్రతిరోజు చెత్త వాహనాలు కాలనీల్లో సంచరించడంతో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా సాగింది. ఈ ఏడాది వారానికి ఒక్కరోజు చెత్త వాహనాలు వచ్చిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో గతంలో 18చెత్త వాహనాలు, రెండు ట్రాక్టర్లు ఉండగా ప్రస్తుతం ఐదు చెత్త వాహనాలే దిక్కయ్యాయి. రెండు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ ఒక్క ట్రాక్టర్ నర్సరీకి మొక్కలు చేరవేస్తుండగా, మరో ట్రాక్టర్ చికెన్ సెంటర్లు, హోటళ్లలో వ్యర్థాలను తీసుకొని వెళ్తున్నాయి. ఐదు చెత్త వాహనాలు 18వార్డుల్లో సంచరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వార్డుల్లో చెత్తా చెదారంతో నిండిపోతున్నాయి.

మున్సిపాలిటీ పరిధిలో...

చెన్నూర్ మున్సిపాలిటీలో 25,579మంది జనాభా 18 వార్డులున్నాయి. పవిత్ర శ్రావణమాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటున్నారు. జగన్నాథాలయం ప్రహరీ పక్కన డంపింగ్ యార్డును తలపించే విధంగా చెత్త కుప్పలు ఉండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం ఎదుట రాత్రి సమయంలో గేదెలు పడుకొని అధ్వానంగా చేస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకు ఒక్కసారైనా చెత్తను తొలగించడం లేదని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు కాలనీల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పర్యటనల సందర్భంగా ప్రధాన రోడ్లు శుభ్రం చేయించి చేతులు దులుపేసుకుంటున్నారని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నామమాత్రంగానే...



బట్టిగూడెం పక్కనే మురుగు నీటి గుంత ఉంది. మురుగు నీరు ఉన్న గుంతలో వ్యర్థాలు వేయడంతో కాలనీ దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగాయి. మున్సిపల్ అధికారులు కాలనీని పట్టించుకున్న పాపనపోలేదు. జ్వరాలు ప్రబలి జనం పరేషాన్ అయినా, అధికారులకు పట్టింపు లేదు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్, ఫాగింగ్ లాంటి చర్యలు చేపట్టడం లేదు. జిల్లా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

\- గడ్డం వాసు, బట్టిగూడెం

కాలనీని పట్టించుకునే నాథుడే లేరు..



మా కాలనీని పట్టించుకున్న నాథుడే లేరు. మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగాయి. రోడ్ల పక్కన చెత్త చెదారం, గుంతల్లో నిలిచిన నీటితో కంపు కొడుతోంది. చెన్నూర్ మున్సిపాలిటీ ఉన్నట్లే కానీ, ప్రజలను పట్టించుకున్న అధికారే లేరు. జిల్లా అధికారులు పట్టించుకోవాలి.

\- ఆశ రాజమణి, జోగిని కాలనీ

కేజీబీవీలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

సమాచారం

- **5వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించండి**

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజును ఈ నెల 5లోగా చెల్లించాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ ఎస్.రాజేశ్వర్‌రావు తెలిపారు. వచ్చే నెలలో వార్షిక పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ప్రవేశం పొందిన వారు, గతంలో ఫెయిలైన వారు అడ్మిషన్ నంబర్ ద్వారా గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

- **భీమారం ఏపీఎంగా శ్రీనివాస్‌గౌడ్**

భీమారం: ఐకేపీ మండల ఏపీఎంగా శ్రీనివాస్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న త్రియంబక్‌ను నెన్నెల మండలానికి బదిలీ చేసి, ఆయన స్థానంలో మంచిర్యాల డీఆర్డీవో ఆఫీస్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్ గౌడ్‌ను కేటాయించారు.

- **6న 'జీఎం కార్యాలయం ముట్టడి'**

కాసిపేట: సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. మండలంలోని ట్యాంక్‌బస్తీలో ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పని ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ లేదని, అనేక మంది కార్మికుల ప్రాణాలు పోతున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆగష్టు 6న చేపట్టిన 'చలో జీఎం కార్యాలయం ముట్టడి'ని విజయవంతం చేయాలని కార్మికులను, ప్రజలను కోరారు. కార్మికులు విజయవంతం చేయాలన్నారు.

- **హమాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక**

మంచిర్యాలటౌన్: మంచిర్యాల హమాలిసంఘం ఎన్నికలను ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షులుగా షేర్ శంకర్, చిట్టవేణి లక్ష్మణ్‌లు పోటీ చేయగా, షేర్ శంకర్‌పై చిట్టవేణి లక్ష్మణ్ 103ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జనరల్ సెక్రటరీ స్థానానికి బోడకుంట రాంచందర్, బియ్యాల శ్రీహరి, సైతం శ్రీనులు పోటీ చేయగా 198ఓట్ల మెజారిటీతో బోడకుంట రాంచందర్ విజయాన్ని సాధించారు.

జ్ఞాపకాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం



శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని భగత్‌సింగ్ విద్యా మందిర్‌లో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జ్ఞాపకాల వేదికగా మారింది. 1983లో కీర్తిశేషులు వానమామలై సత్యనారాయణచారి ఈ పాఠశాలను స్థాపించారు. అప్పటి నుంచి 2013వరకు చదివిన విద్యార్థులంతా మొదటి సారిగా ఈ పాఠశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చారిని నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యారంగంలో చేసిన సేవలను వివరిస్తూ రాసిన పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులంతా నాటి తరగది గదిలో జరిగిన తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. నేడు వారు ఎలా జీవితంలో రాణిస్తున్నారో తెలియజేశారు. నాటి గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. సత్యనారాయణచారి కుటుంబ సభ్యులు పద్మజ, కళా ప్రవీణ్, వైజయంతిమాల, కార్యక్రమానికి అతిథులుగా విజేందర్‌రెడ్డి, బీ.శ్రీనివాస్, ఎం.రాజేంద్రపాణి, డీ.రమేశ్, కేదారి, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజాహిత పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రారంభించిన ప్రజాహిత పాదయాత్ర కార్యక్రమంలో మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల నాయకత్వంలో జిల్లా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాదయాత్రకు తరలివెళ్లారు.

ఆఖరి మజిలీకి అష్టకష్టాలు!



చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో శ్మశానవాటిక లేదు. పట్టణంలో ఎవరైనా చనిపోతే గోదావరి నది, వాగు ప్రాంతాల్లో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. గోదావరి నది వద్ద దహన సంస్కారాలు నిర్వహించినవారు నదిలోనే స్నానాలు చేస్తున్నారు. వాగు వద్ద కార్యక్రమం నిర్వహించినవారు వాగులో నీరు లేక మిషన్ భగీరథ పైపులైన్ వద్ద ఇబ్బందుల మధ్య స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి శ్మశానవాటిక నిర్మించేదాకా వాగు ఒడ్డున స్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

దండేపల్లి: దండేపల్లి మండల విద్యావనరుల కేంద్రం కార్యాలయ ఆవరణ చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. కార్యాలయానికి వచ్చే వారితో పాటు, కార్యాలయ సముదాయంలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులు కూడా బురదతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బురద అయిన చోట కనీసం మొరం పోయించాలని పలువురు కోరుతున్నారు.



బస్సులు పెంచండి.. బాధలు తీర్చండి



భీమారం: మండల కేంద్రంలో బస్‌స్టాప్ వద్ద ఆదివారం ప్రయాణికులు గంటల కొద్ది ఎదురుచూసినా బస్సులు రాకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. ప్రతీరోజు బస్సుల కోసం కష్టాలు పడుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆదాయం తెచ్చిపెట్టే ఈ రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని, ప్రయాణికుల బాధలు తీర్చాలని కోరుతున్నారు.

సైడ్ డ్రైన్ ఓపెన్..!

తాండూర్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి వెళ్లే దారి కుంగిపోయింది. ఫోర్‌లైన్ నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్‌ను ఏర్పాటు చేసిన నేషనల్‌హైవే అథారిటీ అధికారులు ఆ తర్వాత మరమ్మతులు మరిచారు. ఎరువులు కొనుగోలు చేసుకొని పోయే సమయంలో వాహనాలు వచ్చి వెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని వారు కోరుతున్నారు.



అట్టహాసంగా రుద్రాభిషేకం

- వేలాదిగా హాజరై తరించిన సాయిబాబా భక్తులు



శివలింగపూజలో పాల్గొన్న సాయిబాబా భక్తులు

బెల్లంపల్లి: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బెల్లంపల్లిలో శ్రీ సత్యసాయి సేవా సదనంలో 99వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆద్యంతం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. రంగారెడ్డి జిల్లాకు చెందిన 27మంది వేద పండితులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వేద శిక్షణ పొందుతున్న మరో 50మంది శిక్షకులు, 200మంది పుణ్యదంపతులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అట్టహాసంగా నిర్వహించారు. భజన కళాకారులు గీతాలాపన చేసి భక్తులను మంత్రముగ్ధుల్ని చేశారు. ముందుగా ఐదుగురు దంపతులు శివలింగ పూజను నిర్వహించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వేద పండితులు 11సార్లు రుద్రపఠనం చేయగా 200మంది దంపతులు మరో 200మంది వ్యక్తిగత భక్తులు సంయుక్తంగా శివలింగానికి గంగాజలం, పంచామృతం, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ ఘట్టాన్ని భక్తులు ఎంతో నిష్టతో, మరెంతో భక్తి భావంతో కొనసాగించారు. సత్యసాయి బాబా సందేశం వినిపించి మంగళ హారతితో ముగించారు. ఆఖరు ఘట్టంగా భక్తులకు సత్యసాయి దర్శనం చేయించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు యాదగిరిరావు, జిల్లా సాయి సేవా సంస్థల అధ్యక్షుడు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

- **గుండెపోటుతో సీపీఐ నాయకుడి మృతి**

మందమర్రిరూరల్: పట్టణంలోని సీపీఐ సీనియర్ నాయకుడు, మేర సంఘం పట్టణ కమిటీ సహాయ కార్యదర్శి రాయభారపు జనార్దన్(58) గుండెపోటుతో మృతి చెందాడు. తన కుమారుడు సుజిత్ ఛాతిపై నొక్కుతూ ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు సుజిత్, కూతురు సుప్రజ ఉన్నారు.

- **సింగిల్ విండో మాజీ చైర్మన్...**

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్, సింగిల్ విండో) మాజీ చైర్మన్ సింగతి పెద్దన్న(93) ఆదివారం మృతి చెందారు. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన పెద్దన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పీఏసీఎస్ చైర్మన్‌గా మండలవాసులకు, రైతులకు సేవలందించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దన్న భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- **ముందస్తు అరెస్ట్**

జన్నారం: చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా జన్నారం మండల బీసీ సంఘం నాయకులను ఎస్సై అనూష ఆధ్వర్యంలో ముందస్తు అరెస్ట్ చేశారు. ఉదయం 7గంటలకే బీసీ కులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, కో కన్వీనర్ లక్ష్మీనారాయణలను అరెస్ట్ చేసి మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

సంక్షిప్త వార్తలు

చెన్నూర్: స్థానిక పోలీసులు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓ వర్గానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు అకినపల్లి విజయ్(లడ్డూ)ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి మంత్రి పర్యటనలు లేకున్నా ముందస్తు అరెస్ట్ పేరుతో కాంగ్రెస్ నాయకుడిని అదుపులోకి తీసుకోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సీఐ దేవేందర్‌రావును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

- **నూతన కార్యవర్గం**

భీమారం: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ మధు తెలిపారు. అధ్యక్షుడిగా మంతెన సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ఆవిడపు సురేష్, గాలిపల్లి నాగభూషన్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం తిరుపతి, ప్రచార కార్యదర్శిగా కుమ్రే సాగర్, సహాయ కార్యదర్శిగా దాసరి నరేందర్, కోశాధికారిగా సమ్మయ్య నియామకమైనట్లు తెలిపారు.